నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 8 నవంబర్ 2024 | NIZAMABAD





ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

## కొండపైకి తరలిన లక్ష్మీనారసింహుడు

- ప్రధాన వీధుల్లో ఊరేగింపు
- హారతులు, బోనాలతో నీరాజనం
- ప్రారంభమైన లింబాద్రి గుట్ట బ్రహ్మోత్సవాలు

భీమ్‌గల్, నవంబర్ 7: దక్షిణ బద్రినాథ్‌గా పేరుగాంచిన లింబాద్రి లక్ష్మీనారసింహ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని గ్రామాలయంలో ఉత్సవ విగ్రహాలకు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలతో అందంగా అలంకరించిన పల్లకిలో ఉత్సవ మూర్తులను ఉంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా బోనాలు, మంగళ హారతులు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా గుట్ట పైకి తీసుకెళ్లారు. స్వామి వారి నామ స్మరణతో పట్టణం మార్మోగింది. ఈ ఉత్సవాలు ఈ నెల 17 వరకు కొనసాగుతాయని, 10న స్వామి వారి కల్యాణోత్సవం, 14న జాతర నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి తెలిపారు. కార్యక్రమంలో పురోహితులు నంబి వాసుదేవాచార్యులు, వేణు, ప్రణీత్, మహేశ్, రఘు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మోర్తాడ్‌లో ధాన్యం కల్లం వద్ద రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

## 'ప్రైవేటు'లో అమ్ముకున్న రైతులకూ బోనస్ ఇవ్వాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, నవంబర్ 7: అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన పలు వివాహాది శుభాకార్యాలకు వెళ్తూ..మార్గమధ్యంలో మోర్తాడ్ వద్ద ఆగారు. వడ్లను ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతుల వద్దకు వెళ్లి మాట్లాడారు. ప్రభుత్వమే క్వింటాలుకు రూ.2800 ధరతోపాటు అదనంగా రూ.500బోనస్ ఇచ్చి కొంటామంటుండగా, ప్రైవేటు వ్యాపారులకు ఎందుకు అమ్ముకుంటున్నారని రైతులను ప్రశ్నించారు. కల్లాల మీదికి వడ్లు తీసుకువచ్చి 20రోజులు గడుస్తోందని, ప్రభుత్వం బోనస్ ఇచ్చి వడ్లు కొంటుందన్న నమ్మకం లేక వ్యాపారులకు అమ్ముకుంటున్నామని రైతులు సమాధానం ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం ఆలస్యమైనందున, ఇప్పటికే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకున్న రైతులకు కూడా క్వింటాలుకు రూ.500బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల వడ్లకు రూ.500బోనస్ చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. దళారులకు అమ్ముకున్న వడ్లకు కూడా బోనస్ చెల్లించాలన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

## పాత ఫోన్లను అమ్మారా..!

- సైబర్‌నేరాలకు గురయ్యే అవకాశాలు అధికం
- వాటి ద్వారానే బాధితులకు డబ్బుల ఎర
- రాజస్థాన్ సైబర్ లింక్‌లో పాత ఫోన్లే కీలకం
- పాతఫోన్లను ఇతరులకు అమ్మొద్దంటున్న సీఎస్‌బీ




హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): పాత సెల్‌ఫోన్‌ను తెలియని వారికి విక్రయిస్తే చిక్కుల్లో పడే అవకాశాలున్నాయని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు హెచ్చరిస్తున్నారు. పాత మొబైల్ ఫోన్లను కొని వాటితో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఘటనలు వరసగా వెలుగు చూస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. గత ఆగస్టులో బిహార్‌కు చెందిన ఓ ముఠాను రామగుండం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి ఏకంగా 4,000కు పైగా సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ ముఠాను విచారించడంతో ఎన్నో కీలక విషయాలు వెలుగుచూశాయి. ఇటీవల తెలంగాణ పోలీసులు అరెస్టు చేసిన రాజస్థాన్ ముఠాకు, ఈ పాతఫోన్లు కొని, వారికి విక్రయించే ముఠాలకు సంబంధం ఉన్నట్టు తేలింది. పాత సెల్ ఫోన్లు కొనుగోలు చేస్తున్న ముఠాలు కిలోల లెక్కన మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసి.. అందులోని సమాచారాన్ని రిట్రీవ్ చేసి, అందులోని కాంటాక్ట్ నంబర్ల చొప్పున సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. గతంలో పట్టుబడిన ఈ ముఠా బిహార్‌లోని కతిహార్ జిల్లా రౌతారా ప్రాంతానికి చెందిన అక్తర్ అలీ సూచనతో పాత సెల్ ఫోన్లు కొంటారు. తమ నుంచి కిలోల లెక్కన అక్తర్ వాటిని కొనుగోలు చేసి, కీలక సమాచారం సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు.

### పర్సనల్ డాటాతో జర భద్రం..


సాధారణంగా సెల్‌ఫోన్లలో కాపర్, లిథియం తదితర లోహాలతోపాటు మదర్ బోర్డు, ఐసీ, స్క్రీన్ లాంటి ఉపకరణాలు ఉంటాయి. అవి వినియోగించగలిగే స్థితిలో ఉంటే నేరగాళ్ల ముఠాలు వాటిని వేరు చేసి తిరిగి విక్రయిస్తారు. పాత ఫోన్లలో డేటాను ఫార్మాట్ చేయకపోతే పర్సనల్ చిత్రాలు, వీడియోలు ఉంటే అవి సైబర్ నేరస్తుల ముఠాలకు అమ్ముతున్నారు. వీటితోపాటు ఆ ఫోన్లను వీలైతే మరమ్మతు చేసి, సైబర్ నేరాలకు పాల్పడుతుంటారు. ఒకవేళ పోలీసులు దానిపై విచారిస్తే ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఆధారంగా అమ్మినవాళ్లే నేరస్తులుగా పరిగణించబడతారని హెచ్చరిస్తున్నారు. అందుకే సైబర్ కేటుగాళ్లు తెలివిగా ఇతరుల పేర్లపై ఉన్న సెల్ ఫోన్లను, సిమ్ కార్డులను వినియోగించి నేరాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు.

## గ్రామానికి రాని లారీలు నిలిచిన కొనుగోళ్లు

- కల్వర్టు వద్ద గుంతలే కారణం



లింగంపల్లి కలాన్ గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు



లారీలు రాకపోవడంతో.. నిలిపివేసిన ధాన్యం కొనుగోళ్లు

నాగిరెడ్డిపేట, నవంబర్7: లింగంపల్లి కలాన్‌కు వెళ్లే రోడ్డులో గుంతలు ఏర్పడడంతో గురువారం లారీలు రాలేదు. దీంతో గ్రామంలో ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారు. వానకాలంలో గ్రామానికి వెళ్లే రోడ్డులో పోచారం ప్రధాన కాలువ వద్ద కల్వర్టు కొట్టుకపోవడంతో నీటిపారుదల శాఖ అధికారులు తాత్కాలికంగా మట్టిని వేసి బాగుచేశారు. దీంతో కల్వర్టు వద్ద గుంతలు పడడంతో లారీలు అందులో దిగబడుతున్నాయి. రెండు రోజులుగా సేకరించిన ధాన్యాన్ని తాండూర్ గ్రామం మీదుగా లారీల్లో తీసుకువెళ్లారు. ఆ రోడ్డు కూడా పూర్తిగా కంకర తేలి, పెద్ద పెద్ద గుంతలు పడి వెళ్లడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని లారీలు రావడం లేదని గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. లారీలు రాకపోవడంతో ఇప్పటి వరకు 1700 బస్తాలను కాంటా వేసి సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. రోడ్డు బాగు చేయించాలని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ సొంత డబ్బులతో రోడ్డు బాగు చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## ఆర్టీసీ స్పెషల్ బస్సుల్లో చార్జీల తగ్గింపు

ఖలీల్‌వాడి, నవంబర్ 7: ఆర్టీసీ స్పెషల్ హైర్ బస్సుల్లో చార్జీలను తగ్గించినట్లు నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాహాలు, దైవదర్శనాలు, తీర్థ, విహార యాత్రలకు వెళ్లే వారికి 20 శాతం తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు. శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక రాయితీలు కల్పించినట్లు తెలిపారు. విజ్ఞాన, విహార యాత్రలకు వెళ్లే విద్యార్థులకు 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఆర్మూర్ 7382843133, బోధన్ 9849500725, బాన్సువాడ 9491105706, నిజామాబాద్ 9959226022, కామారెడ్డి 8468220281 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## త్వరగా ధాన్యం తూకం వేయాలి

- వడ్ల సేకరణ కోసం విరివిగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి చంద్రాయన్‌పల్లి కొనుగోలు కేంద్రం తనిఖీ



కల్లం వద్ద మహిళా రైతుతో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్

ఇందల్వాయి, నవంబర్ 7: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన రైతులు రోజుల తరబడి వేచి చూడాల్సి న పరిస్థితి ఉత్పన్నం కాకుండా త్వరగా వడ్లను తూకం వేయించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ శరత్ అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణ కోసం ప్రభుత్వం విరివిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. గురువారం ఆయన నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మం తు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్‌తో కలిసి ఇందల్వాయి మండలంలోని చంద్రాయన్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనఖీ చేశారు. రైతులతో మాట్లాడి, ధాన్యం సేకరణ తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా ఇబ్బందులుంటే చెప్పాలని సూచించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని, రవాణాపరమైన ఇబ్బందులు ఏర్పడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ సుమారు 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలనే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా 673 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు.

బోధన్, బాన్సువాడ ప్రాంతాల్లో మరో మూడు వారాల వరకు ధాన్యం కొనుగోళ్లు కొనసాగనుండగా, బాల్కొండ తదితర ప్రాంతాల్లో పంట దిగుబడులు కొంత ఆలస్యంగా వచ్చినందున డిసెంబర్ 15 వరకు కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచాల్సి వస్తుందని ప్రత్యేకాధికారి దృష్టికి తెచ్చారు.

### నిర్ణీత గడువులోపు ఇంటింటి సర్వే పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేను నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ శరత్ సూచించారు. ఇందల్వాయి మండల కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఆయన జిల్లా అధికారులతో సమావేశమై ఇంటింటి సర్వే ప్రగతిని సమీక్షించారు. ప్రతి ఇంటిని ఎన్యుమరేటర్లు సందర్శించి ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా పూర్తిస్థాయిలో పక్కాగా కుటుంబ వివరాలు సేకరించేలా చూడాలన్నారు.

## గర్గుల్‌లో కొనుగోలు కేంద్రం సందర్శన

కామారెడ్డి, నవంబర్ 7 : కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ శరత్ పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కుల గణన సర్వేలో సమగ్రంగా పూర్తి సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 423 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో సన్న రకం వడ్ల కొనుగోళ్లకు 67 కేంద్రాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 4466 మంది రైతుల నుంచి 30,629 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, విక్టర్,ఆర్డీవో రంగనాథ్ రావు,పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, డీసీవో రామ్మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, ఎస్సీ సంక్షేమ అధికారిని,జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి రజిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్

## పలువురు సీఐలకు స్థానచలనం

ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

వినాయక్‌నగర్, నవంబర్ 7: మల్టీజోన్-1 పరిధిలో పలువురు సీఐలకు స్థానచలనం కలిగింది. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌తోపాటు ఆదిలాబాద్ జిల్లా బోథ్, మెదక్ జిల్లా, ఐజీ ఆఫీస్‌లో వెయిటింగ్‌లో ఉన్న 13 మంది సీఐలను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్‌కుమార్‌ను ఐజీ కార్యాలయానికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో నిజామాబాద్ పీసీఆర్‌లో ఉన్న బుక్కా శ్రీనివాస్‌ను నియమించారు. ఆర్మూర్ టౌన్ సీఐ రవికుమార్‌ను ఐజీ ఆఫీస్‌కు ట్రాన్స్‌ఫర్ చేయగా, ఆయన స్థానంలో ఐజీ ఆఫీస్‌లో ఉన్న సత్యనారాయణకు పోస్టింగ్ ఇచ్చారు. రుద్రూర్ సీఐ జయేశ్‌రెడ్డి ఐజీ ఆఫీస్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఐజీ కార్యాలయంలో ఉన్న రెడ్డిబోయిని కృష్ణను నియమించారు. నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తంను రామగుండం ట్రాఫిక్ సీఐగా ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## షరతులు లేకుండా జీవనభృతి ఇవ్వాలి

రాజంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బీడీ కార్మికులు



- తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం నాయకుల డిమాండ్
- బీడీ కార్మికులతో కలిసి రాజంపేట్ 'తహసీల్' ముట్టడి

రాజంపేట్, నవంబర్ 7: ఎలాంటి షరతులు లేకుండా బీడీ కార్మికులకు రూ.4,016 జీవనభృతి అందించాలని తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీడీకార్మికులు మండల కేంద్రంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించి, తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించారు. తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు మాట్లాడుతూ.. పదిహేను రోజులుగా కామారెడ్డి నియోజకవర్గంలో వేలాదిమంది బీడీ కార్మికులు జీవనభృతి చెల్లించాలని ఆందోళన చేస్తుంటే, స్థానిక ఎమ్మెల్యేకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగారపు ఎల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు షరతులు లేకుండా బీడీ కార్మికులకు రూ.4,016 జీవనభృతి ఇవ్వాలని లేనిపక్షంలో స్థానిక ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం ఆంజనేయులు, ఏఐఎఫ్‌టీయూ శ్రామిక శక్తి బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్ అనసూయ, తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం నాయకులు నాంపల్లి, బీడీ టేకేదార్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం భాస్కర్, పంచాక్షరి, నాంపల్లి బాలకిషన్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.